# వ్రణకిణాంకాలు

శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

అంకితం : శ్రీకళాభాయీ రుక్మిణీనాథశాస్త్రికి

(కథానికా కా దిది; వర్ణానికా కాదు. ఒక ఉద్విగ్న నగ్నజీవితపు ఊహాచిత్రం మాత్రం.)

౧

అతనిపేరు చెప్పను. ఎందుకూ చెప్పడం? మీసంగతి నాకు తెలుసు.

అతని దుర్బలజీవితగాథలన్నీ విని అతడెప్పుడైనా కనిపిస్తే — తుపాకులకన్నా భయంకరములైన మీ చూపుడువేళ్లను అతని మీదకి గురిపెట్టి వికవిక వికృతహాసాలు చెయ్యరూ మీరు?

నాకు తెలుసునయ్యా —

'టీ' కప్పులు ఖాళీచెయ్యడానికీ — సిగరెట్టు 'టిన్నులు' వూదెయ్యడానికీ సినీమాలకు వెంటపడడానికీ — మావన్నంటికీ స్నేహితులే; - మనస్సును వ్రయ్యలుచేసే జీవనబాధలను సానుభూతితో విని ఒక్కసారి దగ్గరగా తీసుకోమంటే 'ఒక్కండైన నీమొర ఆలకింపడు కురుత్మనాథ!' గదూ —

అతని నిశిత తర్కశక్తిని మర్యాద మంచీ లేని దుష్పాండిత్యంగాను — స్వచ్ఛ సౌందర్యచింతను పోకిరీతనంగాను — తమ తమ ఖాతాల్లో జమకట్టి, బుర్ర లేకపోయినా - ఒకరినొకరి పొగుడుకుని పైకి వచ్చిన పెద్ద మనుషులంతా ఆఅతిలోక కళాశాలిని పొడిచి-హింసించి బ్రేవని త్రేన్చారు.

ఆదెబ్బతో అతడు ఒకటోరకం 'సినిక్'గా తయారయాడు.

ఈవేళ కొందరు 'కవితాప్రియులు' అతని కెదురుగా వెళ్లి "ఫలానావారు తమరా? అబ్బ! మీపద్యాలు వజ్రాలండీ — అయితే ఈసదరుకథ ఎప్పుడు రాశారూ? ఆ 'అక్షయపాత్ర' పత్రికలోని వ్యాసం కేవలం విశ్వవిద్యాలయం బి. ఎ. కు పఠనీయం చెయ్యవలసింది సుమాండీ" అంటే వారి మాటలన్నీ మీదపడ్డ నిప్పుబొగ్గులలాగ దులిపివేసి సందుల్లోకి తప్పుకుపోతాడు.

౨

డిశంబరునెలలో ఒకనాడు రాత్రి భోజనం చేసుకుని కొంచెం చలిగావున్నా — వీధరుగుమీద మంచం వాల్చుకుని 'శుచిర్భూతం'గా ఒకధూమకాష్ఠం వెలిగించి, చల్లగాలికి మెల్లగా తలలు కదిపే కొబ్బరిచెట్లనూ — శుద్ధదశమి వెన్నెలపాలవానలో తడిసిన పంపరసనాసచెట్ల ఆకులనూ - చూస్తూ, ఆసుఖసన్నివేశంలో కొంచెం కన్నుమూశాను.

అప్పుడతడు ఎక్కడినుంచో వూడిపడ్డాడు. తలఅంతా రోడ్డుబూడిద పడి చెల్లచెదరుగా వ్రేలాడుతూంది. ముఖం బుగ్గలూ క్షయరోగంవాడిలాగ పీక్కుపోయాయి. చొక్కా, పంచ, వుత్తరీయం అన్నీ మాసి రైలుఇంజను పుక్కిలించి ఉమ్మినట్టున్నాడు.

వస్తూనే నన్ను కౌగలించుకొని పసివాడిలాగ నామెడకు చేతులు తగిలించి ఒడిలోకి వ్రేల్లాడాడు.

నేను ఉలికిపడి చూచాను.

వెనక నేను ఒకసారి అతన్ని బెజవాడలో చూచాను. ఎంత వెలిగేకళ్లు — ఎంత సునిశితమైన ముక్కు - చక్కని ఎర్రరంగు ఖద్దరుబట్టలు — కళ్లజోడు — ముందు అతన్ని, నేను చూచికూడా అపోహపడ్డాను. మాట కొంచెం దుడుకు — ఎవ్వరినీ లక్ష్యం చేసేవాడు కాడు.

పాపం — చాలామంది అర్థంచేసుకోలేక తిట్టేవారు. రానురాను అక్కడే నాకు ప్రాణస్నేహితు డయాడు. నన్ను, ఏజన్మలోనో పోగొట్టుకున్న ఆప్తుడు దొరికినట్టు చూచేవాడు. అతని ప్రతిమాట ఒకరసవత్సందేశం —

నేను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అన్నాను.

"నాయనా! నీవేనా? ఏమి టీరూపు? ఏమి టీపతనం?

ఆనాడు ఎంత ఉజ్జ్వలంగా వెలిగేవాడవయ్యా — ఇంతమార్పు నీలో ఎలా వచ్చిపడింది?"

నాకళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

ఇంటిఎదుటి తోటలోని పంపరపనాస పువ్వుల మృదులవాసనలు ఏవో పూర్వజన్మవాసనలను కదల్చుతున్నాయి.

ఆసువాసనాసుఖానికి అతడు కొంచెం తూలి నాముఖమల్ దిండును బలంగా ఆనుకుని, గ్రీష్మకాలపు నిప్పుటెండలకు కాలిన భూమి చల్లని తొలకరివర్షపు కౌగిలింతకు విడిచే వెచ్చని ఆవిరివలె — పొడుగైన నిట్టూర్పు పుచ్చి అన్నాడు.

"అన్నా! 'విసిగినప్రాణుల పిలిచేదేమిటి — 'దుర్గతి — దుర్ఘాతి — దుర్మతి — దుర్మృతి —' కదూ?

ప్రపంచంలో కొంతమంది మనుష్యులు ఎంత అదృష్టవంతులయ్యా!

చేతికి దొరకిన డబ్బులతో — సమయానికి తటస్థపడ్డ భార్యతో — కంటికి అందిన త్రోవలో — జీవితాన్ని ఒంటెద్దుబండిలాగ గెంటుకుపోతారు, సురక్షితంగా.

ప్రయోజకులు — బాగుపడేవారు.

ప్రపంచపద్మవ్యూహంలో పడి నిరంతరం జీవనాన్ని — సంకుల యుద్ధరంగంగాను — తుఫానుసముద్రంగానూ — చేసుకుని, సమాజంలో — పురాణవిశ్వాసాల్లో - తిరుగుబాటును పూహించి, తిట్లు తిని, ఆదర్శాలకోసం పోట్లాడే నావంటివాళ్లూ - నేనూ అప్రయోజకులం - అభాగ్యులం —

తినడానికి అన్నం - తిరగడానికి డబ్బు - శరీరానికి భార్యా - వున్నంతలో మమ్మల్ని దహించే అశాంతి చల్లారుతుందా?

మనుషులు ఇనపముక్కులతో తరిమి పొడుస్తూవున్నా — మా అన్వేషణకు అంతు కనపడదు.

ఒకస్నేహితుడు డన్నాడు: 'మానవజీవితం అంటే — ఒకఅనుపలబ్ధవస్తువుకోసమైన మహాప్రస్థానం - దానిఛాయ జీవితం మీద అంతటా కనపడుతుంది.'

ఔను నిజం —

మా కేం కావాలి? — ఏమో మాకే తెలియదు. మా కోరికలే లోకాతీతాలు కాబోలు కవి అన్నట్టు —

We look before and after
And pine for what is not,

ఇంకోకవి 'వింతగా దోచు నాదు జీవితము నాకె' అన్నాడు.

శుద్ధశ్రోత్రియ హిందువుడికి 'ఖురానె షరీఫ్'వలె అప్పకవి స్కూలువాడికి భావకవి 'కృష్ణపక్షం'వలె సామాన్యసంసారికి మాజీవి తధోరణి – వికృతంగానూ విద్రోహకరం గాను కనపడుతుంది కాబోలు, మమ్మల్ని చూచి పెదవి విరిచి చక్కాపోతాడు.

"కాలిన ప్రేయసిదేహం కమురుకంపు ఈలోకం". మావాడు ఎన్నిహింసల్లో – ధిక్కారాల్లో కుమిలి అన్నాడో పాపం ఈమాటను –

మాకుకూడా చల్లని మంచువంటి జడ బుద్ధిని ఈశ్వరుడు ప్రసాదించివుంటే – మేము మాత్రం దేన్నిగురించీ గాఢంగా ఆలోచించక – దేన్నీ నిశితంగా చూడక – దేన్నీ పూర్తిగా వినిపించుకోక సుఖపడేవాళ్లం కాదూ —

ఆ అదృష్టం మాకు లేదు —

ఏ బృహస్పతి – జాబాలి – చార్వాకుడు ఉపనిషదృషి - మమ్మల్ని సృష్టిచేసి - ఈతలలు పగలగొట్టే తర్కాన్నీ — బ్రదుకంతటినీ కాల్చే సౌందర్యచింతను - నూత్న సంస్కారంకోసం పడే తహతహను - నూరిపోశారోగాని, నూమస్తిష్కం శాంతికి నోచుకోలేదు.

"ఏపువ్వు పూసినా ఏపాట పాడినా
ఏ కష్టజీవినెత్తురు పరదవారినా
ఏవలపుటెడద వెచ్చనియూర్పు కదలినా
ఏపేదవాని ఆకలిచిచ్చు రగిలినా
ఈ హృదయ మెందుకో ఇంత
కళవళపడును."

లేకపోతే — వెంకటచలాన్ని పగిల్చి అన్నికథ లెందుకు బయటపడ్డాయి ?

కృష్ణశాస్త్రిని దహించి అన్ని కావ్యాలు ఎట్లా పుట్టిపడ్డాయి.

శ్రీ. శ్రీ క్షోభించి ఎందు కన్ని 'గరం గరం' గేయాలు వ్రాస్తాడు.

అన్నా, నిన్ను నాతీవ్రధోరణిలో విసిగిస్తున్నానుకదూ. ఇంక చాలు –

ఒక్కసారి కళ్లు తుడుచుకొని నా హృదయం మీదికి చూడు –

దీనిమీద ఎన్ని పుండుమచ్చ లున్నాయో చూశావా ?

ఈ30 ఏండ్ల బ్రదుకులోనూ నాశ్రేయస్కాములైన ప్రియురాండ్రు-స్నేహితులు-బంధువులు అనుగ్రహించిన వరప్రసాదాలు సుమా - ఇవి. - ప్రతిగాయం వెనుకనూ ఒక హిందూదేశచరిత్ర అంత కథ వుంది. చూడు.

## 3

నా చదువు పూర్తిచేసుకుని పట్టణంలో అయాచితంగా దొరికిన ఆచిన్న నౌఖరీని అవలంబించి ఒకమారుమూలవీధినివాసంతో నాజీవితనాట్యానికి తెర తీశాను.

అదే మొదటిసారి ప్రపంచాన్ని చూడడం ప్రారంభించిన నాకు ప్రపంచంఅంతా ఒకబృందావనంలాగు కనపడింది.

ఓహో! విద్యుద్దీపాలు — ధూమశకటాలు — యంత్రాలయాలు — 'మోడరన్ కెఫే'లు - సినీమాలు - అనుకోని విచిత్రానుభవాల సుడిగుండాలలో పడి గిరగిర తిరగడం ప్రారంభించాను.

నాఎదుట ఏ ఇంద్రజాలికుని పింఛమో జరజర కదలి ఇన్ని అద్భుత దృశ్యాలను మొలిపించిం దనుకున్నాను.

సీతాకోకచిలకల్లాగ ఎగురుతూ విద్యాలయాలకు వెళ్లే చిత్రాంగులు - అతిమేధాసంపత్తితో తలదించ లేని ఇంగ్లీషువిద్యాధరులు - మీటింగులు - చిత్తుతీర్మానాలు - ఆదర్శవాదాలు నన్ను భూమిమీద, స్తిమితంగా నిలవనియ్యలేదు. భూమికి పదిగజాల ఎత్తుననే అప్పటి నావిహారం - నావ్యవహారం.

ఇంత మధురమైన మానవ జీవితాన్ని - కొందరు వృద్ధజంబుకాలూ — హతాశులూ - 'సంసారసాగరం దుఃఖం తస్మాజ్జాగృత - జాగృత' అని తిడతారు అనుభవించలేక - పిచ్చివారు అని నవ్వేవాడను.

వీరేశలింగాలూ - సమాజ సంస్కారాలూ, రామమోహనులూ - బ్రహ్మసమాజాలూ, గాంధీమహాత్ములూ - స్వాతంత్ర్య యుద్ధాలూ వేయిచేతులు విసరి నన్నే పిలిచారు, పిలిచినవి

అప్పుడు నాస్నేహితులంతా స్వార్థరహితులే — దేశదాస్యానికి విలపించేవారే - సంస్కారానికి నడుంకట్టి ముందుకు దూకేవారే -

వీరిమధ్య నాజీవితాన్ని ఎంత వున్నతం - ఎంత - ఉజ్జ్వలం చేసుకోవచ్చును.

ఈ మహావకాశాన్ని జారిపోనివ్వగూడదు అనుకున్నాను.

సరిగ్గా ఆ పుణ్యకాలంలోనే నరహరి నాకు ప్రాణస్నేహితు డయ్యాడు. ఎన్నోవిధాల నా ఉత్తమాశయ పరిపూర్తికి తోడ్పడడానికి మాటఇచ్చాడు. ఎన్నో సంస్కారాలు వాడి వడపోసినవాడుట.

స్త్రీజనపక్షపాతంలో బలమైన బ్రహ్మసామాజికుడు - స్వపరభేదం ఎంతమాత్రం లేని పక్కా-అద్వైతి - 'ఋణం కృత్వా ఘృతం పిబేత్తు'లో ఖచ్చితమైన చార్వాకి.

తరచు నావిజ్ఞానాభివృద్ధికీ - ఏకాంతవాసక్లేశ నివృత్తికీ - సహాయపడుతూండేవాడు.

ఒకనాటిరాత్రి సుమారు పదిగంటలకు నాగదిలో దీపంముందు కూర్చుని 'న్యూస్ పేపర్' తిరగ వేస్తున్నాను.

చటాలున నాగదితలుపులు తోసుకుని ఒకపదహారేండ్ల అమ్మాయి ప్రవేశించింది.

నల్లగలువపూవువంటి నాజూకైన ముఖం చామనచాయ - కొత్తఫక్కీలో చుట్టిన జడలో ఏవో రెండుపువ్వులు -

దీపపుకాంతికి మెరిసే అగాధమైన కళ్లలో ఏవోగాథలు -

ఉలికిపడి చూచాను. ఆమె అందుకుంది.

"క్షమించండి - మీకు తెలియకుండా - కథల్లో ప్రవేశించినట్టు - తలవనితలంపుగా ఇట్లా రావడం అపచారమని నాకు తెలుసు. మీ విశాలహృదయమును - పరోపకార దయాస్వభావములనుగూర్చి విని గత్యంతరం లేక ఇట్లా వచ్చాను.

పరిచయం లేనివాటికి అందులోను ఒక యువకుని దగ్గరకు - రాత్రి నావంటిది రావడానికి ఏవో అనివార్యపరిస్థితు లుండవచ్చునని మీవంటి బుద్ధిమంతులు వూహించుకోగలరు.

కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

స్త్రీజన్మ ఎంత క్షుద్రమైనదీ - ఎంత నిస్సహాయమైనదీ - ఇప్పుడు తెలియవచ్చింది నాకు. - నన్నిపుడు ఎవరు ఆదుకోగలరు? ఎవరు నా అంధజీవితానికి తోవ చూపించగలరు?"

"అసలు మాది కృష్ణాజిల్లా - సాతాని వైష్ణవుల ఇంటిబిడ్డను. నాపేరు వెంకటలక్ష్మి- నాకు ముసలితల్లీ - అయిదేండ్ల తమ్ముడూ తప్ప చెప్పదగ్గ ఆస్తి ఏమీ లేదు.

వివాహబంధంలో చిక్కుకుని ఆదీనులను విడిచిపెట్టలేక చదువుకుని మా బీదకుటుంబానికి సహాయపడదలచి, ఈవూరి హైస్కూలు అధికారులు స్త్రీ విద్యాభివృద్ధికి మంచిప్రోత్సాహం ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చాను. ఇంతవరకూ వారిసాహాయ్యంమీదనే ఆధారపడి ఈ సంవత్సరం స్కూలు ఫైనలు క్లాసులోకి వచ్చాను.

నేటికి నాకు శనిరోజులు వచ్చాయి. నా మీద పిడుగువంటి అపవాదు పుట్టింది.

నేటికి నాచరిత్ర 'అనుమా'నాస్పదం అయింది. కిట్టనివారు అధికారులతో ఏవేవో చెప్పారు. వారు నమ్మి నన్ను రేపటినుంచి హాస్టలు విడిచి పొమ్మన్నారు. పబ్లికు పరీక్షలు ఇరవైరోజు లున్నాయి. తెల్లవారితే నాకు ఇక్కడ నిలవనీడ లేదు."

తెల్లని పైటచెరగుతో కళ్లు తుడుచుకుంటూతల తిప్పుకుంది.

ఆమెమాటలు మెత్తని నాకొత్తహృదయంమీద గుచ్చుకున్నాయి.

స్త్రీజనోద్ధరణంమీద ఉపన్యాసాలు దంచడంతో ఆగే ఆరితేరిన పెద్దమనిషినైతే చాలా విచారాన్ని ఇంగ్లీషుతో తెలిపి పంపివేసి వుండును.

ఆదర్శ ఆశయాలను అమలుకూడా చెయ్యాలనే అవివేకినిగనుక ఒకనిశ్చయంతో లేచాను.

"అమ్మా! నీదురదృష్టకథవల్ల నాహృదయం కరిగింది. త్రికరణశుద్ధిగా నేను చెయ్యగలిగినంత సహాయం చేస్తాను.

ఈ రాత్రికి తిరిగిరాను - ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. ఇక్కడనే విశ్రమించు - బెంగపెట్టుకోకు" - అని ఊరిచివరవున్న ఒక బ్రహ్మసమాజ స్నేహితుడి ఇంటికి వెళ్లాను. సంగతంతా చెప్పి నెలరోజులు అతనిఇంట ఆమెకు ఆశ్రయం ఇమ్మని ప్రార్థించాను.

అతడు నవ్వుతూ ప్రేమతో వీలులేదని పంపివేశాడు.

శ్రీకేశబ్ చంద్రలూ - రామమోహనులూ స్థాపించిన విశ్వప్రేమమతంలో కొందరిలో ఇంత కుళ్లు వుందని నాకు తెలియలేదు.

ఆ రాత్రికి ఒక సత్రంఅరుగుమీద పడుకొని తెల్లవారేసరికి నాగదిప్రాంతానికి చేరుకున్నాను.

నాకళ్లు గిర్రున తిరిగాయి. నాగదిలో వింతదృశ్యం.

నరహరి నాగదిలో వున్నాడు. ఆమె పైటను ఒడిసిపట్టి సరసాలాపా లాడు

తున్నాడు. ఆమె ప్రణయకోపంలో గునుస్తూ పెనుగులాడుతున్నది. ఇద్దరూ నిద్రమత్తులో తూలుతున్నారు. నరహరి నన్ను చూచి చల్లగా జారిపోయాడు. ఆమె గ్రహించి కళవళపాటుగా తలా - చీరా - సర్దుకుని ఒకపుస్తకం పేజీలు తిప్పుతూన్నది. వెళ్లాను. "లక్ష్మీ! ఎంత నమ్మించావమ్మా — నన్ను — మోసం - అబద్ధాలచాటున ఈ కశ్మల జీవితం ఇక్కడ ఇంకా ఎన్నాళ్లు గడపదలచావు? -

వాణ్ణే పెళ్లిచేసుకుని ఇకనైనా నిర్మలంగా బతుకు - విద్యాలయాధికారులు న్యాయంగానే ప్రవర్తించారు. వెళ్లు - దీనితో చిన్న ఖర్చులు తీర్చుకో - ఒకకవరు విసిరివేశాను.

తలవంచుకొని వెళ్లిపోయింది.

ఛీఛీ! నరహరీ - ఈమే - కలిసి నన్నెంత పశువును చేశారు - నన్నడ్డంచేసుకుని ఎంతక్షుద్రనాటకం ఆడదలచారు.

నరహరి ఎంత సంస్కారవాది! ఎన్ని పవిత్రోపన్యాసాలు - ఇంతనీచుడు నాకు ప్రాణమిత్రుడా - సిగ్గుతో కుంగిపోయాను. నరహరి మళ్లా కనపడలేదు. నేనే లక్ష్మిని చేరదీసి ఆమెబ్రదుకును భగ్నంచేసి తరిమివేశాననీ, - తాను - ఎంత బుద్ధిచెప్పినా వినలేదనీ నరహరి నామీద 'స్కాండల్సు' ప్రారంభించాడని తరవాత తెలిసింది. ప్రపంచంలో ఒకతట్టుదుర్వాసన అప్పుడు నాఘ్రాణేంద్రియానికి కొట్టింది. పిదప మనుష్యమాత్రుణ్ణల్లా నమ్మడానికి వీలులేదని గ్రహించి, సజ్జన సాంగత్యంకోసం తడుముకుంటూ వుండగా కొన్నాళ్లకు మాధవరావుగారితో నాకు మైత్రి ఏర్పడింది. నాగుణాలు ఏవి ఆయనను అంతగా ఆకర్షించినవోగాని నన్ను ఆయన ఎంతో ప్రేమించాడు.

తరచు తమఇంటికి వస్తూండమనీ చక్కని సాహిత్యచర్చలంటే తనకు చాలా ఇష్టమనీ అనేవాడు.

నాకు కొత్తవారిఇంటికి వెళ్లడమంటే ప్రాణాంతకం. వాయిదాలు వేస్తూ ఆఖరికి ఒకనాడు ఆయన బలవంతంమీద వెళ్లాను.

చక్కని కొత్తమాదిరిఇల్లు - చుట్టూ పూలతోట. డ్రాయింగురూములో అందమైన రోజ్‌వుడ్డు కుర్చీలు - మధ్య టిపాయ్ మీద చైనాగాజు కూజాలో రకరకాల పూలగుత్తులు.

అక్కడ కూర్చుని అప్పటి రాజకీయాల మీద సాహిత్యధోరణిమీద కొంతసేపు ప్రసంగం జరిగినమీదట ఆయన ఇంట్లోకి చూచి 'సుభా! రెండుకప్పుల 'టీ' తెచ్చి పెట్టమ్మా' అన్నాడు.

పదినిమిషాల్లో ఆకుపచ్చపూల కర్టెన్ తొలగించి 'ట్రే'లో టీకప్పులు వుంచుకొని ఒకబంగారపుబొమ్మ ప్రవేశించి 'ట్రే' ఆయన ముందు వుంచింది. "చూడమ్మా! ఈయన ఫలానా నాస్నేహితులు ఇప్పటి తెలుగు రచయితల్లో మంచిచెయ్యి - పత్రికల్లో చాలా చదివివుంటావు." పరిచయంచేశాడు.

ఆమె ఈషత్తు తలయెత్తి మందహాసంతో గౌరవించింది. వేయిమొగలిపొట్టలలోని రేకులు నాచుట్టూ వికసించి తీవ్రంగా పరిమళించినట్టయింది.

తర్వాత ఆయన నావైపు చూచి 'ఈమె మాచెల్లెలు సుభద్ర - ఇంగ్లీషు వచ్చినా తెలుగురచనలంటే ప్రాణం. చిన్నప్పుడే

మంగళసూత్రం అమంగళపాత్రం అయిపోయింది, అన్నారు జాలిగా. -

ఆమె తలవంచుకుంది.

నేను ప్రసంగం మార్చాను. టీ సేవిస్తూ రుచినైన మాటలలోకి దిగాం. కొంతసేపటిలోనే సుభద్ర అరమరికలేకుండా చనవుగా సస్నేహముగా మాచర్చలలో పాలుపుచ్చుకుంది. ఎంతచురుకు - ఎంత చలాకీ - ఆ ఎర్రని కుంకుమపూవుపెదవులు కదలితే చాలు - కావ్యరహస్యాలు- విజ్ఞానకాంతులు నృత్యంచేస్తాయి.

వారితో చాలాసేపు గడపి సెలవుతీసుకుని నాశూన్యగృహమార్గం పట్టాను.

కాళ్లు ముందుకు - హృదయం వెనకకు- ఏదో విచిత్రానుభవం.

"చెలివలపులేని యాబ్రతుకు కాల్పనె చెపుమ?"

"ప్రేమ కలుగక బ్రదుకు చీకటి" అనే కవివాక్కులు ఉపనయనమునాటి బ్రహ్మోపదేశంలాగు నాచెవులలో రింగుమని మ్రోగుతున్నాయి. ఆ 'ఆలివు' రంగు సిల్కుచీర- రసప్రపంచములను పుక్కిలించే నల్లనికళ్లు 'సైగల్'కంఠమాధుర్యలోని సంగీతకళవంటి ఆమెతియ్యని కదలికలు - నన్ను విడువకుండా వెంటాడుతున్నాయి

మనస్సు మహాచెడ్డది - ప్రేమ బహుదొడ్డది. ఎన్నడూ ఎరగని వికారం ఒకటి నన్ను పట్టుకుంది.

నా అంతటనేనే వారిఇంటికి ఎన్నోసార్లు వెళ్లాను. మాధవరావుగారు మిక్కిలి సంతోషంగా నన్ను ఆహ్వానించి - నాచేత పద్యాలు చదివించి ఎన్నో చర్చలు రేపెట్టేవారు.

ఎప్పుడూ సుభద్ర నాపక్షం -

క్రమంగా మాస్నేహం వదల లేనంత బలిసింది. మంచి పుస్తకాలూ - పత్రికలూ - వెదకి సుభద్ర కివ్వడం నాపని -

తనకు నచ్చిన గ్రంథభాగాలు - పద్యపు తునకలు నన్ను వెదకి వినిపించడం ఆమెకు నిత్యకృత్యం -

మామధ్య ఒక ఆనందసముద్రం పొంగి అమృతతరంగాలు విసరడం ప్రారంభించింది.

పద్మావతీదేవి జయదేవుని జీవితాన్ని మధురలాస్యం చేయించినట్టు - సుభద్ర నాబ్రదుకును ఎన్నడూ ఆరని దివ్యజ్యోతులతో వెలిగించుతుంది కాబోలు -

ఒకనాడు మామూలుగా కాలక్షేపానికి వారింటికి వెళ్లాను. మాధవ రావుగారు ఎక్కడికో వెళ్లారు. సుభద్ర ఎక్కడా కనపడలేదు. పెరట్లోకి వెళ్లాను.

అప్పుడే సూర్యాస్తమయం అయి, సరుగుడుచెట్ల సన్నని కొమ్మలవెనక చంద్రుడు లేచి వెలుగుతున్నాడు.

సుభద్ర పారిజాతపుచెట్టుకింద నించుని ఒకకొమ్మ నానుకుని, సబితాదేవి 'పోజు'లో లీలాదేశాయి ఒకనాట్యభంగిమపు వంపులో ఆవైపు తిరిగి ఏదో ఆలోచిస్తూన్నది. రెండుపువ్వులు ఆమెతలమీద పడి వెన్నెల కాంతిలో మెరుస్తున్నాయి.

అప్పుడు నాలో కోటిరసధునులు ఉప్పొంగిపోయినవి. ఆ మనోహర ప్రకృతిలో - నా మనస్సు బుద్ధి ఆత్మ అన్నీ ఏకమై పరవశంగా

నన్ను ఒకఆనందనిష్ఠకు గెంటినవి. నే నేమీ ఆలోచించలేక పోయాను.

నెమ్మదిగా సుభద్రదగ్గరకు వెళ్లి బుజం మీద చెయ్యివేసి 'పద్యాలు ఆలోచిస్తు న్నావా సుభా?' అన్నాను.

ఆమె వేటువడ్డ ఆడుత్రాచువలె ఎగసి పడి నాచేతిని విదళించి దూరంగా జరిగి, 'ఏమి టీప్రవర్తన? మీరుగనక ఇప్పటికి... క్షమిం చాను. పురుషులకు లోబడడమంటే నాకు చాలా అసహ్యం'. వెళ్లిపోయింది.

నానోటమాట రాలేదు. ఏమి టీప్రళ యం? పూలదండ ఇందుమతీదేవిని చంపినట్టు ఈ 'స్నేహమయి' నన్ను హింసించింది.

"విషము పృమృతం క్వచి ద్భవేత్
అమృతంవా విష మీశ్వరేచ్ఛయా".

ఆ అవమానభారంతో కుంగిపోయి నర కపు లోతులకు అసూర్య నామలోకాలకూ ప్రాకిపోయాను.

ఔను, నేను గాఢంగా పొరబడి ప్రేమ కోసం చేయిచాచడం తప్పుకాదూ?

ఏమో - ప్రేమించడం అపచారమా? ఒక రిని ప్రేమించడం ప్రేమించకపోవడం మన చేతుల్లో వున్నదా - అది హృదయధర్మం— దానిముందు అహంకారం అహంకర్తృత్వం నిలవలేవు. బానిసలు -

ఈమె చూపిన స్నేహమంతా ప్రేమ పరిపాక మనుకున్నాను. ఈమెది ఇంత రసవిహీన ప్రకృతిగాబోలు -

చాలు. ఈమర్మోపఘాతం - దారుణ తిరస్కారం తిరుగులేని ఆశాభంగం - ఇదే మొదలూ తుదిగా జన్మాని కంతటికీ చాలు- అక్కణ్ణించి తలయెత్తకుండా వెళ్లిపోయాను. ఒకసంవత్సరం తిరిగిపోయింది.

౪

హఠాత్తుగా ఒకనాడు విశ్వనాథంగారు రోడ్డుమీద కనపడి ఎంతో ఆదరించి మాట్లా డాడు.

నా కెక్కడో దూరబంధువట - ఎంత బంధుప్రీతి - ఎంత మాటపొందిక - సాక్షాత్ బుద్ధదేవుల్లా కనిపించాడు.

నాతెలివిని - చదువును - భవిష్యత్తును నేను వద్దనేదాకా పొగిడాడు. ఎంత మంచి వాడు మంచితనం అంతా ఆయనలో పేరు కున్నట్టు కనబడ్డాడు.

ఒకపూహ—

ఈయనకు నావల్ల ఏమైనా అవసరం వుందా లేకపోతే ఎందు కింత 'తైరు'?

ఛా- స్వార్థరహితుడు - గాంధితరవాత గాంధీ అంతవాడు.

విశ్వనాథంగారి మాట నాకు యజుర్వే దంకన్న ప్రమాణంగా కనపడింది.

ఒకసారి ఆయనఇంటికి నన్ను తీసుకు వెళ్లారు. వారింట్లో అంతా అంతే - బహు సున్నితం - మర్యాదాలోనే పుట్టారు.

అందరూ అనర్గళంగా చదువుకున్నట్టు కనపడతారు. ఐదేళ్ల కుర్రవెధవకూడా కం దిపప్పు బుక్కుతూ ఆరోగ్యసూత్రాలు మాటాడుతాడు

అప్పుడు నాకు వారింట్లో జరిగిన ప్రత్యు త్థానానికీ గౌరవానికీ మితిలేదు.

తత్ఫలితం వెంటనే నాకు కనిపించ లేదు గాని - ఆరునెల్లకు ప్రత్యక్షం అయింది.

విశ్వనాథంగారి అన్నకూతురు ఒకగొంగళీపురుగు నాకు ధర్మపత్ని అయింది.

ఎన్ని ప్రలోభనాలు—ఎన్ని ఆకర్షణలు — నా ఉన్నతాదర్శాలను - నా భావనలోని మధుమూర్తులను - నాశనంచేశాయి.

అనవరతమూ అంబరవీథుల్లో — సౌందర్యకాంతుల్లో — మందాకినీ సువర్ణసైకత వేదికల్లో — విహరించే నామెడకు భూలోకంనుంచి ఒకఇనపగొలుసు వచ్చి తగిలి నేలమట్టానికంటా లాగివేసింది.

ఎంత వేదనపడ్డాను — ఎన్ని వెన్నెల రాత్రులను కన్నీళ్లతో గడిపాను. నాపతనానికి ఎంత ఏడ్చాను.

తర్వాత విశ్వనాథంగారు నన్ను కూర్చోబెట్టి ఇప్పటి యువకుల బుద్ధిలోపాన్నీ — సంఘసంస్కారవ్యాధినీ — సంధ్యావందన ప్రాశస్త్యాన్నీ — తద్దినప్రాధాన్యాన్నీ —సనాతన మతాభిమానాన్నీ — పురస్కరించుకొని వచ్చీరాని సంస్కృతకారికలను ఉదాహరిస్తూ లెక్చర్లు దంచడం మొదలుపెట్టాడు.

అసహ్యంవేసి ఆయన బూజుభావాల కింద నిలవలేక ఒకసారి లేచిపోయాను.

ఆసాత్త్వికమూర్తి కొరకొరలాడి 'వినాశకాలే విపరీతబుద్ధిః' అని ఆశీర్వదించాడు.

లౌక్యులయ్యా — ప్రయోజకులు —

మాగౌతమబుద్ధుడు ౨౦ శతాబ్ది తగు మనిగా తయారయ్యాడు.

ఇప్పు డెవరైనా నాప్రసంగం ఎత్తితే చప్పలించి పెదవి విరిచివేస్తాడు - బాంధుసముద్రుడు -

రామబంధువు —

రెక్కలు కాలి అధోలోకానికి జారిపోయిన సంపాతివలె నేను క్షుద్రులలో పడిపోయాను. నాభవిష్యత్తు అధోగతి పాలైపోయింది.

నామహోజ్జ్వల భావాలు ధూళిలోపడి పొరలుతున్నాయి. నాతరుణజీవితం పతితమైపోయింది.

కళ - రసికత్వం - చమత్కారం — ఉత్సాహం అన్నీ ప్రేమోమచెట్టునుంచి చిలకల్లా నానుంచి ఎక్కడికో ఎగిరిపోయాయి.

ఇంక నాజీవితపరిధుల్లో ముఖ్యసామగ్రిగా ఏర్పడ్డవి - కుళ్లుమొహాలూ - డబ్బులూ - కాగితాలు - పిల్లలు - జమాఖర్చులు—

అధికార్లూ - ఆశ్రయింపులూ - దొంగనవ్వులూ స్వార్థాలూ —

అప్పటినుంచి శరత్కాలపు పాలవెన్నెలరాత్రులలో హంసరెక్కలమీద రివ్వున పరుగులెత్తే స్వచ్ఛ సౌందర్యరేఖాసందేశములు నాకు వినబడడంలేదు.

వసంతశ్రీ విశ్వవికాసమాధుర్యమూ వర్షాప్రభాత ఉషస్సువర్ణనదీకాంతిప్రపూర శోభాదర్శనం - ఇంక నా చర్మచక్షుస్సులకు లేవు.

నాకన్నులవెలుగు నష్టమయింది.

నాభావనలోని తీపి చచ్చింది.

నామస్తిష్కంలో ఏవో చిల్లులుపడ్డాయిగాబోలు—

తెలివి- యుక్తులు - చొరవ - అన్నిటికీ ఒకటే క్షామం.

ఈనాడు ఆరేండ్లకుర్రకుంక నన్నెదురొకని నే నన్నదానినల్లా కాదని సునాయాసంగా ఓడించగలడు.

ఇప్పుడు ప్రతిచేటపెయ్యా నన్ను బెదిరించగలిగినదే —

ధిక్ - ధిక్ —

అన్నా! నిన్నింక బాధపెట్టను—

చాలా ఆయాసంగా బరువుగా అన్నాడీమాట —

నా ఎడారిబ్రతుకుకు 'ఒయాసిస్సు' వంటి నిన్నుఒక్కసారి చూచిపోదామని వచ్చాను.

వివిక్తహిమవత్సాంద్రారణ్యములలోకి పోయి ఘోరతపస్సు చెయ్యాలి. అంతవరకు చిచ్చువంటి నా ఆత్మకు శాంతిలేదు.

నేను పునర్జన్మమెత్తి నవ్యచైతన్యంతో తిరిగివచ్చి — ఈ జన్మలో పిరికితనంవల్ల వృద్ధజంబుకాలవల్ల — ఫలవంతములు కాని ఆదర్శభావాలను అప్పుడు ఫలింపించుకుంటాను. ఆచరణకురాని ఆశయాలను - నెరవేరని తీవ్రకాంక్షలను - నిర్వర్తించలేని ఉదాత్తకార్యములను-నిర్వహించితీరుతాను.

చటుక్కున ఉద్రేకంగా మరోప్రపంచపు పిలుపు విని ఉలికిపడ్డవాడిలాగు లేచి నించున్నాడు.

నేనతన్ని కౌగలించుకొని బాష్పములతో శిరస్సును తడుపుతూ తొట్రుపాటుగా ఏదో అంటున్నాను.

అతడు వినిపించుకోకుండా ఆప్రశాంత నిశీథినిని దూసుకుంటూ వెళ్లిపోయాడు.

మైసూరు అగరువత్తివంటి ఆకళాతపస్విజీవితం ఎన్ని చేతుల మీదుగా అంటుకుందో — పాపం!

—



మా పూదిరి ఉండుడు -

సంసారసౌఖ్యమును

అనుభవింపుడు

మేము ఎంత ఆరోగ్యముగా, సౌఖ్యముగానున్నామో చూడుడు! ఆరునెలల క్రిందటనే నేను చాల నీరసముగానుండి జీవితసౌఖ్య మనుభవింపజాలని స్థితియందుంటిని. వైద్యుడు సనటోజన్ శిఫార్సు చేసెను. సనటోజన్ వలన వెంటనే గుణము కన్పించినది. నారక్తనాళములందు క్రొత్తజీవధార ప్రవహించినట్లుండెను. ఇప్పుడు నాకు చాల బలము, ఆరోగ్యము, పటుత్వము, దేహదార్ఢ్యము ఏర్పడినది. మరల మేము తనివితీర సంసారసౌఖ్యమును అనుభవించుచున్నాము." సనటోజన్ వలన మీ ఆరోగ్యమున ఎక్కువమార్పు కన్పించును. నరములకు బల మొసంగును. రక్తపుష్టికలుగును. త్వరలోనే యౌవనమునం దుండు ఆరోగ్య మేర్పడును. (2)

కెమిస్టు లందరివద్దను, బజారులలోను దొరకును.

SANATOGEN

THE TRUE TONIC FOOD

